# మానవుడి విజయం

మిట్ట మధ్యాన్నం. గదిలో పడుకుని ఏదో పుస్తకం చదువుకుంటున్నాను. మొదట వీధి తలుపు తెరిచిన సవ్వడీ, వెనువెంటనే గొంతు సవరించుకున్న శబ్దమూ వినిపించాయి. ఆ సవరింపు నాకు బాగా గుర్తే. వచ్చేడివాడు ఆదిశేషయ్య!

"ఏం శేషయ్యమామా! రా, కూర్చో. ఈ మధ్య మన కార్యకలాపాలు బొత్తిగా స్తంభించిపోయినట్టున్నాయి! ఏం చేస్తున్నావు? లేదా, ఏం చేయదలచుకుంటున్నావు?" అంటూ పరామర్శించాను.

"ఏమీ చేయడంలేదు, ఊరికే గోళ్ళు గిల్లుకుంటూ యింటిదగ్గర పడివున్నాను" చాపపైన కూర్చుని గోడకు చేరగిలబడిపోతూ అన్నాడు ఆదిశేషయ్య.

ధర తగ్గుట హెచ్చుటకొరకే అన్న వాదాన్నిబట్టి చూస్తే ఏమీ చేయకపోవడం ఏదైనా చేయడానికే! గోళ్ళు గిల్లుకుంటూ కూచుంటే గానీ కొందరికి ఊళ్ళు ముంచే ఉపాయాలు స్ఫురించవు!

మూసి ముల్లుగొట్టుకపోయిన ఆకాశంలా అయిదు నిమిషాలు కదలకుండా మెదలకుండా కూచున్న తర్వాత ఉన్నట్టుండి నోరు తెరచి "ఒరే బాబూ! ఓ కాగితం చేతికి తీసుకో" అన్నాడు ఆదిశేషయ్య.

తెల్లబోతూ అతడి ముఖంలోకి చూశాను. కొంపదీసి ఆశుకవిత్వం చెప్పడుగదా! ఆదిశేషయ్యలో కవిత్వమే గానీ కవిత్వం పెల్లుబుకడానికి ఆస్కారం లేదు. ఒకవేళ ప్రోనోటేమో! అబ్బే, అయివుండదు. ఆదిశేషయ్య ప్రోనోటు కుంకం కట్టుకోడానికి, తప్పితే మరెందుకూ పనికిరాదని ఆ ప్రాంతంలో అందరికీ తెలుసు!

తినబోతూ రుచులడగడ మెందుకని పెట్టె తెరిచి కాగితం పైకి తీశాను.

"మొన్న మన వూళ్ళో హరికథ జరిగింది గదూ! కథ ప్రారంభంలో హరిదాసు మంచి మంచి పసందైన మాటలు కొన్ని చెప్పాడు. వాటి నలాగే కాగితంపైకి దించేయాలి..."

అర్థంకాక మరి కొంత వివరణ కోరుతూ అతడివైపు చూడసాగాను.

"మరేం లేదు. ఈ ప్రపంచకమంతా వట్టి మాయ. సంసారమంటే అదొక వూబి. ఎందరు రాజులు రాజ్యాలేల

లేదు! వాళ్ళేం మూట గట్టుక పోయారు? పోయేనాడు పూచికపుల్లయిన వెంట వస్తుందా? అందువల్ల దీపమున్నప్పుడే యిల్లు చక్కబెట్టుకోడం మంచిది...అలా అలా వ్రాసుకుంటూ వెళ్ళు మరి! ముఖ్యమైన విషయం తర్వాత చెబుతాను..."

అయితే ఇది ఉపోద్ఘాత మన్న మాట! ఇంతకూ అసలు విషయ మేమిటో?

తనంతట తానై తన వుద్దేశమేమిటో బయటపెట్టేదాకా నే నతడి పథక మేమిటో తెలుసుకోలేక పోయాను.

అసలు సంగ తేమిటంటే ధర్మవరం నుంచీ రాయలపేటకు వెళ్ళే రోడ్డులోనట, పన్నెండో మైలురాయి దగ్గర గుక్కెడు మంచినీళ్ళు దొరకక బాటసారులు తల్లడిల్లి పోతున్నారట! అందుకుతోడూ ఆ ప్రాంతంలో తలచాటు కొక చెట్టయినా కనిపించదట! అక్కడ చేదబావి ఒకటి త్రవ్వి. ఓ సత్రాన్ని నిర్మించాలని ఆదిశేషయ్యా వుద్దేశం. అందుకోసం ఉదార హృదయులైన సజ్జనులు విరివిగా చందాలు, విరాళాలు యిచ్చి తోడ్పడవలసిందిగా అభ్యర్థించడం ఈ విజ్ఞప్తిలోని సారాంశం!

విజ్ఞప్తి వ్రాయించుకు వెళ్ళిన ఆదిశేషయ్యా మరునాడు తెల్లవారేసరికి ఊళ్ళో లేడు. ఎక్కడెక్కడ తిరిగాడో ఏమిటో నాలుగైదు నెలల పర్యంతం అజాపజా లేకుండా పోయాడు. ఒక పడి బియ్యామనీ, పిడికెడు ఉప్పనీ, గుప్పెడు మిరపకాయ లనీ తులసమ్మత్త వూళ్ళో ప్రతి యింటా అప్పులు చేసిపెట్టింది. చీలికలు వాలికలైన చింపిరి దుస్తులతో గంగజాతరలో బయ ల్దేరిన వేషాల్లా అతడి బిడ్డలు వీధుల్లో తిరుగుతూ వూళ్ళో ఎక్కడబడితే అక్కడ కనిపించారు.

ఓ రోజు వుదయం పళ్ళు దోముకుంటూ చెరువుకట్ట దిగి వూళ్ళోకి వస్తున్నాను. రచ్చపైన ఆదిశేషయ్యా హఠాత్తుగా ప్రత్యక్షమయ్యారు.

మనిషి మునుపటికన్నా చిక్కిపోయాడు. గడ్డం గుబురుగా పెరిగింది. పెదవులమధ్య కాలుతున్న చుట్టతో గుప్పు గుప్పున పొగ వదులుతూ, నల్లగా మాసిపోయిన దుస్తుల్లో బొగ్గుల్లో మునిగి తేలిన యింజనులా కనిపించాడు.

"ఏం శేషయ్యమామా! ఎప్పుడొచ్చావు?" అన్నాను.

"ఎప్పుడొస్తేనేమిగానీ ఈ గడ్డంతో పెద్ద పీడగా వుందిరా బాబూ! మంగలికోసం చూస్తున్నాను" అన్నాడు ఆదిశేషయ్యా.

ఏమాత్రం వసూలయిందని వాకబు చెయ్యాలనుకున్నాను. కానీ ఎప్పుడొచ్చావన్న మామూలు ప్రశ్నలే సదుత్తరం లేక పోగా, యిక ఈ విశేషాంశాన్ని గురించి ప్రస్తావించే చొరవ నాకు లేకపోయింది.

ఆదిశేషయ్యా కలిమి లేములతో తన కేమీ సంబంధం లేనట్టుగా కాలచక్రం మళ్ళీ దొర్లిపోసాంది. ఒకటి రెండు మాసాలు గడిచిపోయాయి. ఈ వ్యవధిలో ఆదిశేషయ్యా యింటిల్లిపాదికీ వరుసగా కొత్త బట్టలు కొన్నాడనీ, పది మూటల వడ్లు తీసి మిషనులో దంపించాడనీ రోజు కొకటి రెండు చొప్పున కొత్తకొత్త కబుర్లు నా చెవిలో పడుతూ వచ్చాయి. అయిదారు నెలల పొడుగునా అరగడుపు పరగడుపుగా వస్తులు మాడిన ఆ కుటుంబానికి ఈమాత్రం వెసులుబాటు కలగడం నాకు కాస్తా సంతృప్తినే చేకూర్చింది. కానీ ఈ

సంతృప్తికి వెనుక నాలో ధర్మవరం – రాయలపేట బాటసారుల పట్ల సానుభూతి లేకపోలేదు! పాపం, వాళ్ళని భగవంతుడు నాటికీ, నేటికీ చిన్నచూపే చూచాడు! ... తెట్టతేరకు భగవంతుడిపైన నింద వేయకుండా వేరొక విధంగా భావించడం యింకా మంచిది! వాళ్ళడిగివచ్చిన రాత చిన్నది! 'ఎండలో తల మాడిపోవాలి, కాళ్ళు కాలిపోవాలి, నాలుక పిడచగట్టుకపోవాలి' అని అడిగివచ్చిన వాళ్ళకు సత్రాలు, చేదబావులూ ఎక్కడినుంచి లభిస్తాయి!

ఒకసారి మానవ రక్తానికి మరిగిన తర్వాత పెద్దపులిని ఆ వ్యామోహం ఒక పట్టాన వదిలిపెట్టదని చెబుతారు. అది శేషయ్య రెండోసారి విజ్ఞప్తి వ్రాయించుక పోవడానికి వచ్చినప్పుడు నా కా పోలిక జ్ఞప్తికివచ్చి నిర్విణ్ణుడినైపోయాను.

రెండోసారి ఆదిశేషయ్య తన పథకాన్ని కొంచెం సవరించుకున్నాడు: నిరంకుశుడైన నియంతలా కాకుండా మంచి 'మూడ్'లో వున్న మంత్రిసత్తముడిలా అందుకు కారణాలు గూడా విశదీకరించాడు – "సత్రమూ, చావడీ, గుడీ, గోపురమూ అంటే ఈ రోజుల్లో మనుషులు కదిలీ మెదలడంలేదు! ఉన్న సత్రాలే పాడుబడిపోతుండగా కొత్తవి కావలసివచ్చాయా అంటూ దులపరించుకుని వెళ్ళారు. ఇంకా వాళ్ళే నయం! మరి కొందరైతే 'రోడ్డులో బస్సులు పరుగెడుతుండగా వీళ్ళనెవడు నడిచి చావమన్నాడు' అంటూ మడతపేచీకి సిద్ధమయ్యారు. ఎందుకొచ్చిన గొడవ గానీ నువ్వీ దఫా నేను చెప్పినట్టు వ్రాయరా బాబూ!"

ఎలా వ్రాయాలో చెప్పమన్నాను.

ఆదిశేషయ్య ఈ దఫా ఊరు పూరంతా పరశురాముప్రీతి అయిపోయినట్టు వ్రాసేయమన్నాడు!

ఆ వ్రాయడం గూడా చదివినవాడి గుండె అలాగే కరిగి కన్నీరై పోయేలా వ్రాయమన్నాడు. ఫెడీల్, ఫెడీల్‌మని వెదుళ్ళు ఎలా చిట్లిందీ, గాలి విసురులో మంట లెలా నాలికలు సాచిందీ, ఆడా మగా, చిన్నా పెద్దా, పిల్లా జల్లా ఎలా దీనంగా ఆక్రోశించిందీ తుణ్ణంగా వర్ణించమన్నాడు. ఇలాంటి దుర వస్థలో ఇల్లూ వాకిలీ, తిండీ గుడ్డా లేకుండా తల్లడిల్లిపోతున్న గ్రామస్తులకు యథోచితంగా ధనరూపంగానో, ధాన్యరూపం గానో సాయపడడం తోటి మానవుల కనీసపు ధర్మమని నొక్కి వక్కాణించమన్నాడు.

"అమాత్రం రాయకపోతే నాలుగు రూకలు రాలవురా బాబూ! నీకు మరేం భయంలేదులే! నేనీసారి రొంపిచెర్ల దగ్గరనుంచి మొదలుపెట్టి గొట్టిగిల్లు, బాకరాపేట, నెరబయలు దాకా వెళ్తున్నాను. ఆ యిలాకావాళ్ళకు అసలీ పేరుతో ఒక వూరున్నదీ, లేనిదీ తెలియదు! వట్టి భోళాభాయీలనుకో! చిటికెలో నమ్మించవచ్చు వాళ్ళని! నా అవస్థేదో నేను పడ తాను గానీ నువ్వు నేను చెప్పినట్టు వ్రాసివ్వు! తొందరపెడు తున్నాననుకోకు. బాగా ఆలోచించి నిదానంగానే వ్రాయి..."

మరునాటి ఉదయం మసకమసక చీకటిలో వీధి మెట్లు దిగుతున్నాను. అరుగుపైన కూర్చున్న ఆదిశేషయ్య తటాలున లేచి నిల్చుంటూ "రాసేశావా నాయనా!" అన్నాడు.

"లేదు శేషయ్యమామా! వ్రాయాలనుకోలేదు. నిజా నికి నేనావిధంగా వ్రాయలేను" అన్నాను.

"ఏం, ఎందుకు వ్రాయవు?" జీవితంలో గొప్ప ఆశా భంగం పొందినవాడిలా అడిగాడు ఆదిశేషయ్య.

"చూచి చూచి అలాంటి అబద్ధం వ్రాయడానికి నాకు మనస్కరించదు" అన్నాను.

"పోనీలే, వూరి సంగతి నాకొద్దుగానీ నాయిల్లుమాత్రం కాలిపోయినట్టు రాయి! ఇందుకయితే నీకు మనసొప్పుతుంది గదా! ఒరే అబ్బీ! కథలూ, కారణాలూ వ్రాసి నీకొక మాదిరిగా చేయి తిరిగిందని యిలా ప్రాధేయపడుతున్నాను. అదేదో గొప్పపనైనట్టు నువ్వు బిగ్రబిగుసుకుంటున్నావు. ఆ మాటకొస్తే నేనొక టడుగుతాను. కథల్లో నువ్వు రాసేదంతా నిజమేనేమిటి?"

నాకు ఒళ్ళు మండింది. గబగబా యింటిలోపలికి వెళ్ళి వెనుకా ముందూ చూడకుండా పది గీతలు గిలికి ఆ కాగితాన్ని తెచ్చి అరుగుపైన పడవేసి, "నీకు వెయ్యి నమస్కారాలు శేషయ్యమామా! ఇక మీదట యిలాంటి విజ్ఞప్తులు రాసి పెట్టమని నన్ను బలవంతపెట్టకు" అన్నాను.

ఎదుటివాడు నొచ్చుకోడంతో గానీ, మెచ్చుకోడంతో గానీ ప్రమేయం పెట్టుకోని మనిషి ఆదిశేషయ్య. కాగితం చేతిలో పడగానే గబాలున పైకి లేచి తిరిగి చూడకుండా వెళ్ళి పోయాడు.

ఆదిశేషయ్య కొంతకాలంపాటు కొందరిని మోసగిం చాడు. ఎంతోకాలం అందరినీ మోసగించలేకపోయాడు. ఎలా బయటపడిందో గానీ అతడి కుతంత్రం బయటపడింది. ఇలాంటి

వాడు కమ్మీలకు బయట వుండడం లోకానికి ఉపద్రవకరమని భావించి పోలీసులు ఆదిశేషయ్యను తమ 'కస్టడీ'లోకి తీసుకున్నారు. ఒకటి రెండు రోజుల్లో ప్రాథమిక చర్యలన్నీ ముగించి, లోకుల్ని దగాచేశాడన్న నేరం క్రింద ఎక్కడా ఓటు గానీ బీట గానీ లేకుండా అతనిపైన కేసును రూపొందించారు.

ఒక్క తులసమ్మత్త తప్పితే ఈ పరిణామాన్ని గురించి చింతించే నాథుడే లేకపోయాడు. కేసు జరుగుతున్నప్పుడు జామీను నిలిచి అతణ్ణి విడిపించుకునే ఔదార్యం మానవమాత్రుడికెవడికీ లేకపోయింది! కడకతని తరఫున న్యాయవాది గానీ సాక్షులు గానీ లేకపోయారు.

ఎలాగూ నీ యిల్లు కాలిపోయింది. రెండు సంవత్సరాల పాటు ప్రభుత్వంవారికి అతిథిగా వుండి వెళ్ళమన్నాడు న్యాయమూర్తి.

జైల్లోకి వెళ్ళి కూర్చున్న తర్వాత గూడా ఆదిశేషయ్య నన్ను పీడించడం మానలేదు. అప్పుడు స్వయంగా పీడించాడు, ఇప్పుడు భార్యద్వారా పీడిస్తున్నాడు.

"ఏం చేయమంటావు నాయనా! ముందే అబ్బనాకాపురపు మనిషి! ఏమైపోయాడో ఏమిటో ఒకటే ఆరాటంగా వుంది. ఆడదాన్ని పుట్టి బట్ట గట్టినప్పటినుంచీ పొరుగూరి ముఖం చూడనిదాన్ని. ఇప్పుడు గూడా పిల్లల్ని వెంటబెట్టుకుని నేను యిల్లు కదల్లేను. నువ్వయినా వెళ్ళి ఎలా వున్నాడో ఏమిటో చూచిరాకపోతే నాకు నిబ్బరం కలగదు. బాబ్బాబూ! నీ మేలు మరిచిపోను. చచ్చి నీ కడుపున పుడ్తాను..."

చెవిలో యిల్లు గట్టుకున్న తులసమ్మ త్త పోరుపడలేక జైలు అధికారుల కొక విన్నపం వ్రాసి పంపుకున్నాను. వాళ్ళు ఖైదీని కలుసుకోడానికి అనుమతిస్తూ సమయాన్ని నిర్దేశించి నాకు తెలియజేశారు.

*  *  *  *  *

ఖైదీని కలుసుకోడానికి జైల్లో ప్రవేశిస్తూ కొంచెం ఆత్మ విమర్శ చేసుకోవలసి వచ్చింది. ఆదిశేషయ్యా నేరంలో నా పాత్ర గూడా ఏమాత్రమో లేకపోలేదు. అతడి నేరానికి శిక్ష రెండేళ్ళు. నా నేరానికి శిక్ష సరిగ్గా పదిహేను నిమిషాలు!

కమ్ములకు అటువైపున ఆదిశేషయ్యా, ఇటువైపున నేను. దూరంగా చెట్టుక్రింద సాయుధుడైన పోలీసు.

ఆదిశేషయ్యా ఎండి ఒరుగై పోయాడు. జానెడు పొడుగు గడ్డంలో అతణ్ణి గుర్తుపట్టడమే దుస్తరమైపోయింది. ఈ వికార స్వరూపం చాలదన్నట్టు అతడి కొక షరాయి, గళ్ళ బనీను తగిలించారు. ఈ వేషంలో 'విధి' అన్న చిత్రకారుడు వేసిన కార్టూను బొమ్మలా కనిపించాడు.

నన్ను చూడగానే ఆదిశేషయ్యా కళ్ళల్లో కన్నీరు పెల్లుబికింది. పెదవులు ఎండుటాకుల్లా కనిపించాయి. కంఠం గద్గదిక మైపోయింది.

"ఊళ్ళో అందరూ బాగున్నారా?" ఏడుపును అధిగమించి మాట ఎలాగో బయటపడగలిగింది.

"బాగానే వున్నారు శేషయ్యామామా! నువ్వు మాత్రం ఎముకల గూడై పోయావు. జరిగిందేమో జరిగిపోయింది.

అందుకు చింతించి లాభంలేదు. ధైర్యం చిక్కబట్టుకోవాలి. తులసమ్మత్త నిన్ను తలుచుకోని క్షణం లేదు. నువ్వామె కళ్ళల్లో మెదలుతున్నావట! బిడ్డలు నీకోసం బెంగపెట్టుకున్నారని చెప్పమంది..." అన్నాను.

* * *

ఆదిశేషయ్య కారాగార నివాసంలోని క్లేశాలను గురించి చెప్పుకపోసాగాడు. ఆ తిండిని చూస్తే డోకొస్తుందట! ఆ పని చేయలేక ఎముకలు నుగ్గునూచమై పోయాయట! రాత్రుల్లో దోమలూ, నల్లులూ నిద్రపోనీయవట! ఆ మధ్య ఓసారి పది రోజులపాటు జ్వరం ముమ్మరంగా కాచిందట! "చచ్చినా బాగుండేది, మందులిచ్చి మళ్ళీ నన్ను బ్రతికించేశారు" అన్నాడు ఆదిశేషయ్య.

"అదేం మాట శేషయ్యమామా! నువ్వు పోతే నీ బిడ్డలేంగావాలి? తులసమ్మత్త గతేం కావాలి?"

"నిజమేరా బాబూ నిజమే! వాళ్ళను తలచుకుంటే నా గుండె చెరువై పోతుంది" కోనలో కొండవాగుల్లా గడ్డంలో కన్నీటిధారలు!

"టైమయిపోయింది. త్వరగా ముగించండి" బిగ్గరగా అరిచి చెప్పాడు పోలీసు.

"వెళ్ళొస్తాను శేషయ్యమామా!" అన్నాను.

"వెళ్ళొస్తావా! అప్పుడే! ఇదిగో బాబూ! ఉండుండు. ఒక మాట..."!

తటపటాయించకుండా చెప్పమన్నాను.

"నా కేదైనా కలవస్తే అది తప్పకుండా పాటింపుకొచ్చేది. మరి ఈ జైల్లో పడినప్పటినుంచీ ఒకటే కల ... ప్రతి రాత్రీ అదే కల..."

"చెప్పు శేషయ్య మామా! అప్పుడే ఒక నిమిషం ఆలస్యమైపోయింది" అన్నాను.

"ఇల్లు కాలిపోయినట్టు! అసలే నాది పూరికొంప! ఆడదానికి, బిడ్డలకూ ఆ నీడగూడా లేకపోతుందేమోనని నా దిగులు..."

నేను ఆదిశేషయ్యను ఎగాదిగా చూచాను. ఇతడు పాత ఆదిశేషయ్య కాడు. పాత ఆదిశేషయ్య తనలోని దాన వుడికి దాసుడై మానవుణ్ణి హతమార్చడానికి సాయశక్తులా ప్రయత్నించాడు. కానీ మానవుడు మొండివాడు. నేల కడుపులో పడివున్న బీజం తడి సోకగానే మొలకెత్తినట్టుగా అతడు అవకాశం దొరకగానే దుమ్ము దులుపుకుని పైకి లేచాడు. ఆదిశేషయ్యలోని దానవుణ్ణి తోసిరాజని, ఇలలో కాకపోతే నేమి, కలలోనైనా అతడు తన రాజ్యాన్ని స్థాపించగలిగాడు. ఇప్పటికీ పరిణామం చాలు! ఎప్పటికైనా మానవుడిదే విజయమని భావించడంలో వున్న ఆనందం అనుపమానమైంది. అట్టి ఆనందం నాకు మా ఆదిశేషయ్య మామద్వారా లభ్యమైంది.